


# యేసుక్రీస్తు కోపము

**మూలవాక్యము:- మార్కు 10:13,14**

తమ చిన్నబిడ్డలను ముట్టవలెనని కొందరాయనయొద్దకు వారిని తీసుకొని వచ్చిరి; అయితే శిష్యులు (వారిని తీసుకొని వచ్చిన) వారిని గద్దించిరి. యేసు అది చూచి కోపపడి చిన్న బిడ్డలను నాయొద్దకు రానియ్యుడి, వారి నాటంకపరచవద్దు; దేవుని రాజ్యము ఈలాటివారిదే.

ఈ రోజు మనం ధ్యానించబోయే అంశము

**"యేసుక్రీస్తు కోపము":-** ఇది చాలా ప్రత్యేకమైన అంశము ఎందుకంటే పరిశుద్ధ గ్రంథంలో నరుడు(మనిషి) కోపం చూస్తాం.

**ఆది 4:5:-** కయీనును అతని అర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖమును చిన్నబుచ్చుకొనగా । మనిషి మొట్టమిదటిగా కోపపడడం చూస్తాం. ఇక్కడేకాదు మనిషి తరచుగా కోపపడడం మన దైనందక జీవితంలో చూస్తాం. పరిశుద్ధ గ్రంథంలో కూడా అనేక చోట్ల మనిషి కోపపడడం చూస్తాం. తదుపరిగా దేవుని కోపము...

**కీర్తన 78:31:-** " దేవుని కోపము వారిమీదికి దిగెను వారిలో బలిసిన వారిని ఆయన సంహరించెను. ఇశ్రాయేలులో యవనులను కూల్చెను. తండ్రియైన దేవుడు కూడా పరిశుద్ధ గ్రంథంలో పలు సందర్భాలలో కోపపడడం చూస్తాం.

అయితే యేసుక్రీస్తు ప్రభువులవారు కోపపడడం చాలా అరుదుగా చూస్తాం. యేసుక్రీస్తు ప్రభువును గురించి పరిశుద్ధ గ్రంథంలో ఎక్కువగా ఆయన కరుణామయుడు, దయామయుడు, శాంతిమూర్తి, సాత్వికుడు, సమాధానకర్త అని చూస్తాం. అటువంటి ప్రభువుకు కోపం వచ్చింది అంటే ఆ సందర్భం ఎటువంటిదో మనం జాగ్రత్తగా గమనించాలి, పరిశీలనచేయాలి.

## యేసుక్రీస్తు ప్రభువుల వారు కోపపడిన మొదటి సందర్భం

**మార్కు 10:13,14 :-** తమ చిన్నబిడ్డలను ముట్టవలెనని కొందరాయనయొద్దకు వారిని తీసుకొని వచ్చిరి; అయితే శిష్యులు (వారిని తీసుకొని వచ్చిన) వారిని గద్దించిరి. యేసు అది చూచి కోపపడి చిన్న బిడ్డలను నాయొద్దకు రానియ్యుడి, వారి నాటంకపరచవద్దు; దేవుని రాజ్యము ఈలాటివారిదే.

యేసుప్రభువుల వారి దగ్గరకు వస్తున్న చిన్న పిల్లలను రానివ్వకుండా ఆటంకపరుస్తున్న శిష్యులను చూచి ప్రభువు కోపపడడం జరుగుతుంది. ప్రభువు దగ్గరకు వచ్చే పిల్లలను మనం ఆటంకపరచకూడదు.

## చిన్న పిల్లల గురించి దేవుడు చెబుతున్న మాటలు

**మార్కు 10:14:-** దేవుని రాజ్యము ఈలాటివారిది.

దేవుని రాజ్యమును చిన్న పిల్లలతో పోల్చుతున్నట్లు చూస్తున్నాం.

**మార్కు 10:14,15** :- చిన్న బిడ్డలవలె దేవుని రాజ్యమును అంగీకరింపనివాడు అందులో నెంతమాత్రము ప్రవేశింప దని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని చెప్పి.

పైవచనంలో చిన్నపిల్లల యొక్క మనస్తత్వం, మనము కూడా కలిగి వుండాలి. ఈర్ష్య, ద్వేషాలు, పగ, ప్రతీకారాలు కలిగి వుండకూడదు. కల్లాకపటంలేని మనస్సు మనం కలిగి వుండాలి. ఆలాగున వుంటేనే దేవుని రాజ్యములో ప్రవే శిస్తారు అన్న అంశంను మనం జ్ఞాపకం చేసుకోవాలి.

**మార్కు 9:36:-** ఒక చిన్నబిడ్డను తీసికొని వారి మధ్యను నిలువబెట్టి, వానిని ఎత్తి కౌగిలించుకొని । ఇట్టి చిన్నబిడ్డల లో ఒకనిని నాపేరట చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును; నన్ను చేర్చుకొనువాడు నన్ను గాక నన్ను పంపినవానిని చేర్చుకొనునని వారితో చెప్పెను.

**<u>యేసుశిష్యులు వారిలో ఎవరు గొప్పవాడు అని ఒకనితో ఒకడు వాదించుకొనే సందర్భం</u>**

**మార్కు 9:35 :-** అందుకు యేసు ఎవడైన మొదటివాడై యుండగోరిన యెడల , వారి అందరిలో కడపటివాడును, అందరికి పరిచారకుడునై యుండవలెనని చెప్పి.

దేవుని వాక్యం సెలవిస్తుంది మనల్ని మనం తగ్గించుకోవాలని, ఇతరులకు పరిచారం చేసే గుణం మనం కలిగి వుండాలి. చిన్న పిల్లలంటే మానసికంగా చిన్నపిల్లలే కాదు, తగ్గించుకునే స్వభావం కలిగి వుండడమే. అందుకే దేవుని వాక్యం సెలవిస్తుంది. "తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడుతాడు".

దేవునివాక్యం చెబుతుంది చిన్నబిడ్డలను, చిన్నబిడ్డలలాంటి మనస్తత్వం కలిగినవారిని, అల్పులను, పేదలను మనం దేవునినామం పేరిట చేర్చుకుంటే – దేవున్ని చేర్చుకున్నట్లే అంతేకాదు తండ్రిని కూడా చేర్చుకున్నట్లే. తండ్రియైన దేవుడు, కుమారుడైన యేసు, పరిశుద్ధాత్మ దేవున్ని మనం చేర్చుకొనకుండా ఏం చేసినా ఉపయోగం లేదు.

వారిని చేర్చుకొనడమే కాదు....

**మార్కు 10:36** :- ఆ బిడ్డలను ఎత్తి కౌగిలించుకొని, వారిమీద చేతులుంచి ఆశీర్వదించెను.

యేసుక్రీస్తు ప్రభువు తన దగ్గరకు వచ్చు పిల్లలను ఎత్తి కౌగిలించుకొని, వారిమీద చేతులుంచి ప్రార్థించినట్లుగా, ఆశీ ర్వదించినట్లుగా మనం చూస్తున్నాం. మనం కూడా ఆలాగున చేయమని ప్రభువు మనకు మాదిరి చూపించారు. క్రీస్తును కలిగిన మనము ఆశీర్వదించే వారిగా ఉండాలి. శపించే వారిగా ఉండకూడదు.

ఈలాగున చేయకుండా చిన్నబిడ్డలను ఆంటకపరిస్తే దేవునివాక్యం ఏమి చెబుతుందో చూద్దాం.

**మత్తయి 18:6,7** :- నాయందు విశ్వాసముంచి ఈ చిన్నవారిలో ఒకనిని అభ్యంతరపరచువాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచివేయబడుట వానికి మేలు.

కాబట్టి చిన్నబిడ్డలను దేవునిదగ్గరకు రానివ్వకుండా అభ్యంతర పరచువారికి మరణమే మేలు అని ప్రభువు చెబుతు న్నారు.అంతేకాదు క్రింది వచనాలలో గమనించినట్లయితే అభ్యంతరము వలన లోకమునకు శ్రమ, అభ్యంతరము రాక తప్పవుకానీ; ఎవనివలన అభ్యంతరము వచ్చునో ఆ మనుష్యునికి శ్రమ.

పైన చెప్పబడిన అన్ని సందర్భాలలో చిన్నపిల్లలను, అటువంటి మనస్తత్వం కలిగిన వారిని అల్పులను, బీదలను ప్రభువుపేరట చేర్చుకొని వారికి ఆదరణ, కలుగజేసి వారిని ఆశీర్వదించాలని స్పష్టంగా ప్రభువు వాక్యం సెలవిస్తుంది . వారిని ఆటంకపరిచే వారికి శ్రమ, ఆశ్రమ కన్నా వారికి మరణం మేలు అని చెబుతుంది.

**మత్తయి 21:14,15,16** :- గ్రుడ్డివారును, కుంటివారును దేవాలయములో ఆయన యొద్దకురాగా ఆయన వారిని స్వస్థపరచెను.। కాగా ప్రధానయాజకులును, శాస్త్రులును ఆయన చేసిన వింతలను, - దావీదు కుమారునికి జయము అని దేవాలయములో కేకలు వేయుచున్న చిన్నపిల్లలను చూచి కోపముతో మండిపడి ।- వీరు చెప్పుచున్నది వినుచున్నావా? అని ఆయనను అడిగిరి. అందుకు యేసు వినుచున్నాను;

బాలురయొక్కయు, చంటిపిల్లల యొక్కయు నోట స్తోత్రము సిద్ధింపజేసితిని అనుమాట మీరెన్నడును చదువలేదా? అని వారితో చెప్పి ।

చిన్నబిడ్డలను దేవుని చెంతకు రానివ్వకుండ ఆటంకపరచకూడదు. అంతేకాకుండా వారిని ప్రభువు మార్గములో పెంచాలి. వారు ఎల్లప్పుడు దేవున్ని ఆరాధించి, స్తుతించి, దేవుని నామమును ఘనపరిచే బిడ్డలుగా (హన్నా-సమూయేలును పెంచినట్లు) పెంచాలి.

**<u>ప్రభువు కోపపడిన రెండవ సందర్భం</u>**

**మార్కు 3:5** :- ఆయన వారి హృదయకాఠిన్యమునకు దుఃఖపడి, కోపముతో వారిని కలయచూచి - నీ చెయ్యిచాపుమని ఆ మనుష్యునితో చెప్పెను; వాడు తన చెయ్యి చాపగా అది బాగుపడెను.

పై సందర్భంలో పరిసయ్యులు యేసుప్రభువు మీద నేరము మోపవలెననియుండి, విశ్రాంతి దినమున వానిని స్వస్థపరచునేమో అని ఆయనను కనిపెట్టుచుండిరి.

**మార్కు 3:3 :-** ఆయన - నీవు లేచి మధ్యను నిలువుమని ఊచ చెయ్యి గలవానితో చెప్పి । వారిని చూచి-విశ్రాంతి దినమున మేలుచేయుట ధర్మమా కీడుచేయుట ధర్మమా? ప్రాణరక్షణ ధర్మమా, ప్రాణహత్య ధర్మమా । అని అడిగెను; అందుకు వారు ఊరకుండిరి.

యేసు మేలుచేయుటకై ఈ లోకమునకు వచ్చినారు, స్వస్థపరచడానికి ఈ లోకంనకు వచ్చినాడు, అపవాదియొక్క క్రియలను లయపరచడానికి ఈ లోకంనకు వచ్చినారు. అయితే మేలుచేస్తున్న క్రీస్తును పరిసయ్యులు తప్పులు చేస్తున్నాడని వక్రీకరిస్తున్నారు. అందుకే దేవుని వాక్యం చెబుతుంది.

**గలతీ 6:9** :- మనము మేలుచేయుటయందు విసుకక యుందము. మనము అలయక మేలుచేసితిమేని తగిన కాలమందు పంటకోతుము.

అందుకే మనము క్రీస్తుబిడ్డలమై మేలు చేయాలి.

**<u>యేసు కోపపడిన మూడవ సందర్భం</u>**

**యోహాను 2:13-16 :-** " యూదుల పస్కాపండుగ సమీపింపగా యేసు యెరూషలేమునకు వెళ్లి దేవాలయములో ఎడ్లను గొఱ్ఱెలను పావురములను అమ్మువారును రూకలు మార్చువారును కూర్చుండుట చూచి ।

త్రాళ్ళతో కొరడాలు చేసి, గొఱ్ఱెలను ఎడ్లనన్నిటిని దేవాలయములో నుండి తోలివేసి, రూకలు మార్చువారి రూకలు చల్లివేసి, వారిబల్లలు పడద్రోసి । పావురములు అమ్మువారితో – వాటిని ఇక్కడనుండి తీసుకొనిపొండి; నా తండ్రి యిల్లు వ్యాపారపుటిల్లుగా చేయకూడదని చెప్పెను."

దేవాలయములో వ్యాపారం చేయడం సహించలేక యేసు కోపముతో వాటినన్నిటిని పడద్రోసినట్లుగా చూస్తున్నాం. ఇది చూసిన శిష్యులు – నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించునని వ్రాయబడిన లేఖనమును జ్ఞాపకము చేసు కొనిరి.

ఇదే సందర్భంను మత్తయి కూడా చెబుతున్నాడు....

**మత్తయి 21:12,13** :– "యేసు దేవాలయములో ప్రవేశించి క్రయ విక్రయములు చేయవారినందరిని వెళ్ళగొట్టి, రూకలు మార్చువారిబల్లలను, గువ్వలమ్మువారి పీఠములను పడద్రోసి నా మందిరము ప్రార్థనమందిరమనబడునని వ్రాయబడియున్నది. అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడివారనెను."

మందిరము పట్ల యేసుక్రీస్తు ప్రభువుకు ఉన్నటువంటి ఆసక్తిని చూస్తున్నాం. 84వ కీర్తనలో కోరహు కుమారులకు దేవుని మందిరము పట్ల ఉన్నటువంటి ఆశ,ఆసక్తి, భయము, భక్తిని మనము చూస్తాం. దేవుని ఆలయమును జాగ్రత్త గా చూచుకోవాలి. యేసుక్రీస్తు ప్రభువుకు మందిరము పట్ల ఉన్నటువంటి బాధ్యత మనము కలిగి ఉండాలి.

ప్రస్తుత దినములలో అనేక దేవుని మందిరాలను వ్యాపారపు స్థావరాలుగా, దొంగల గుహలుగా చేస్తున్నారు. ఇటువంటివారికి దేవునివాక్యం సెలవిస్తుంది.

**1కొరింథి 3:17** :– ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసినయెడల దేవుడు వానిని పాడుచేయును.

**<u>గమనిక</u>** :

**1కొరింథి 3:16** :– మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?

మన దేహమును మనము పాడుచేయకూడదు, ఈ దేహాన్ని దేవునికొరకు వాడాలి. ఈ దేహములో ప్రభువును ప్రతిష్టించుకోవాలి.

**<u>ముగింపు</u>** : పై మూడు సందర్భాలలో యేసుప్రభువు కోపపడినట్లు చూస్తున్నాం. ప్రభువు కోపపడే విధముగా మనమ ం ప్రవర్తించకూడదు, దేవునికి వ్యతిరేఖంగా మనం ఉండకూడదు, దేవునికి ఇష్టమైన బిడ్డలుగా ఉండడానికి ఈ ఉపవాస దినాలను ఉపయోగించుకుందాము.

**కీర్తన 2:12** :– కుమారుని ముద్దుపెట్టుకొనుడి; లేనియెడల ఆయన కోపించును అప్పుడు మీరు త్రోవ తప్పి నశించె దరు. ప్రభువుకు ఇష్టమైన బిడ్డలుగా జీవించుదాం. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు అనుగ్రహించును గాక! ఆమేన్.